# మన'వే'మన పద్యములు

ఈసారి కూడా రెండు వేమన పద్యములు, వాటి తాత్పర్యములు ఇస్తున్నాము. మీ పిల్లలకి నేర్పడము మరువకండి.

గంగిగోవుపాలు గరిటెడైనను జాలు
గడివెడైన నేమి ఖరముపాలు?
భక్తి గలుగ కూడు పట్టెడైనను జాలు
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థములు :**
ఖరము = గాడిద.

**తాత్పర్యము :**
మంచి ఆవు పాలు గరిటెడైనను అవి పిల్లలకు ఆరోగ్యమును, దేవతలకు ప్రీతిని కలిగించి ప్రయోజనము చేకూర్చును. కాని కడివెడు గాడిద పాలు ఉన్నా అవి నిష్ప్రయోజనము కదా! అదే విధముగా ఆదరణతో పెట్టిన అన్నము పిడికెడైనను తృప్తి కలుగజేయును. ఆదరణ లేకుండా ఎంత గొప్పగా పంచభక్ష్య పరమాన్నములతో వడ్డించిననూ అది గాడిద పాలవలె నిష్ప్రయోజనమని అర్థము.

మట్టికుండ వంటి మాయ శరీరంబు
చచ్చునెన్నడైన చావదాత్మ
ఘటములెన్నియైన గగనమొక్కటే కదా
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థములు :**
ఘటము = కుండ గగనము = ఆకాశము.

**తాత్పర్యము :**
మట్టి కుండ ఎంత కాలము ఉంటుందో, ఎప్పుడు పగిలి పోతుందో చెప్పడం కష్టం. అలాగే అశాశ్వతమైన ఈ శరీరము మాయ. అది ఎంతకాలము ఉంటుందో చెప్పలేము. మట్టి కుండలు ఎన్ని తీసుకున్నా వాటిలో ప్రతిబింబించే ఆకాశం ఒక్కటే కదా! అలాగే మానవుల శరీరములన్నిటిలో ప్రతిబింబించే ఆత్మ శాశ్వతము. శరీరము నశించినా ఆత్మకు చావులేదు. శరీరము అశాశ్వతమని, ఆత్మ శాశ్వతమని తెలియజేయడమే ఇందలి ముఖ్యోద్దేశము.